ఇండస్‌ఇండ్ పరిస్థితి మెరుగ్గానే

డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
స్పష్టంచేసిన రిజర్వుబ్యాంక్

ముంబై, మార్చి 15: ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్‌ఇండ్ బ్యాంక్ లెక్కల్లో వచ్చిన రూ.2,100 కోట్ల తేడాపై రిజర్వు బ్యాంక్ దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉన్నదని మార్కెట్లో గుప్పుమన్న వార్తలపై సెంట్రల్ బ్యాంక్ స్పందించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితికి వచ్చిన ఢోకా ఏమీ లేదని, డిపాజిటర్లు, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చింది. ప్రస్తుతం బ్యాంక్‌లో నెలకొన్న పరిస్థితులను సమీక్షించడానికి, అకౌంటింగ్ తప్పిదాలపై వాస్తవ పరిస్థితులను త్వరగా అంచనావేయడానికి ఇప్పటికే బ్యాంక్ ప్రత్యేకంగా ఆడిట్ బృందాన్ని నియమించినట్లు ఆర్బీఐ పేర్కొంది. ఈ ప్రత్యేక ఆడిట్ బృందం ఈ నెల చివర్లో లేదా వచ్చే నెల తొలి వారంలో తన నివేదికను సమర్పించనున్నదని పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగా బ్యాంక్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బ్యాంక్ ఆర్థిక మూలాలు దృఢంగా ఉన్నాయని, క్యాపిటల్ అడక్వసీ రేషియో 16.46 శాతంగాను, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 70.20 శాతంగా ఉన్నదని పేర్కొంది.

రంగంలోకి ఐసీఏఐ

ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఖాతాల్లో నెలకొన్న అవకతవకలపై నిగ్గు తేల్చడానికి చార్టర్డ్ అకౌంటెంట్ సంఘం ఐసీఏఐ రంగంలోకి దిగింది. రూ.2,100 కోట్ల వరకు లెక్కల్లో వ్యత్యాసంపై ఐసీఏఐ ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక రిపోర్టింగ్ బోర్డ్ ఇచ్చిన సమీక్షపై ఐసీఏఐ ప్రత్యేకంగా సమీక్షించి త్వరలో రిజర్వుబ్యాంక్‌కు తన నివేదికను సమర్పించనున్నది. బ్యాంక్‌లో అకౌంటింగ్ స్టాండర్డ్స్, ఆడిటింగ్, కంపెనీల చట్టం-2013 ప్రకారం షెడ్యూల్ 2, 3 పై కూడా ప్రత్యేకంగా చర్చించనున్నది. మరోవైపు, గడిచిన ఫారెక్స్ లావాదేవీలకు సంబంధించి హెడ్జింగ్ ఖర్చుల్ని బ్యాంక్ తక్కువగా అంచనా వేసినట్టు ఓ అంతర్గత సమీక్షలో తేలింది. బ్యాంకులో పాలనాపరమైన లోపాలున్నాయన్న దానిపై కూడా ఐసీఏఐ దృష్టి సారించనున్నది. గత వారం బ్యాంక్ సీఈవో, ఎండీ కత్‌పాలియా పదవీకాలాన్ని మూడేండ్లకు పెంచుతూ ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు ప్రతిపాదించినా, ఆర్బీఐ మాత్రం ఏడాదికే అనుమతిచ్చింది.

రికార్డుస్థాయిలో ఒప్పందాలు

ఫిబ్రవరిలో 7.2 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ, మార్చి 15: దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఒప్పందాలు, విలీనాలు జరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాల కుమించి వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో కార్పొరేట్ సంస్థలు భారీ స్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. గత నెలలో 226 విలీనాలు-కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 7.2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయని గ్రాంట్ థార్టన్ భారత్ పేరుతో విడుదల చేసిన నివేదికలో డీల్‌ట్రాకర్ వెల్లడించింది. ఒప్పందాల పరంగా చూస్తే 67 శాతం అధికమవగా, విలువ పరంగా చూస్తే 5.4 రెట్లు పెరిగాయి. వీటిలో 85 విలీనాలు అండ్ కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 4.8 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. ఒప్పందాల్లో జెన్ టెక్నాలజీ, నిట్కో లిమిటెడ్‌లు నాలుగు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతోపాటు ఓఎన్‌జీసీ-ఎన్‌టీపీసీ గ్రీన్ 2.3 బిలియన్ డాలర్లతో అయాన రెన్యూవబుల్ పవర్‌ను కొనుగోలు చేశాయి. అలాగే ప్రణా గ్రూపు 755 మిలియన్ డాలర్లతో ఒవెన్స్ కార్నింగ్స్ గ్లాస్‌ను కొనుగోలు చేసింది. ప్రైవేట్ ఈక్విటీ ఒప్పందాలు 141 జరగగా, వీటి విలువ 2.4 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నది.

ఎంఎస్‌ఎంఈలపై ప్రభుత్వం శీతకన్ను

కాగితాలకే పరిమితమైన నూతన పాలసీ
ఇతర రాష్ట్రాలతో మార్కెటింగ్ సమస్యలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఉపాధి రంగానికి ఆయువు పట్టైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగం తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అనుకూల విధానాలతో ఎంఎస్‌ఎంఈ రంగం ఎంతగానో వృద్ధి చెందింది. ఇంజినీరింగ్, కెమికల్స్, మెటల్, ఆహార ఉత్పత్తులు రాష్ట్ర అవసరాలను తీర్చడంతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అయ్యేవి. అయితే గత కొంతకాలంగా గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తీవ్ర పోటీ ఏర్పడినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల తక్కువ ధరకే వారు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలను పూర్తిగా విస్మరించడం వల్ల ఆయా రాష్ట్రాల పోటీని తట్టుకునే పరిస్థితి లేకుండా పోయిందని వారు పేర్కొంటున్నారు. ఈ రంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఎంఎస్‌ఎంఈ-2024 పాలసీ కాగితాలకే పరిమితం కావడంతోపాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో చిన్న..చితక సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

గిరాకీ అంతంతే..

ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తులకు గిరాకీ లేకుండా పోతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ తీవ్రతరం కావడంతో కొనేవాళ్లు కరువయ్యాయని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా ఆహార పదార్థాలు, కెమికల్స్, మెటల్ ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ యంత్రాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, రబ్బర్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, అల్లిక-దుస్తుల ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి ఆహార పదార్థాల నుంచి పోటీ ఎదురవుతుండగా.. మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ప్లాస్టిక్, కెమికల్స్, తమిళనాడు నుంచి యంత్రాలకు పోటీ ఎదురవుతున్నదని చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరకు ఆయా రాష్ట్రాలు మార్కెటింగ్ చేస్తున్నాయని, దీనివల్ల ఉత్పత్తులు అమ్ముకోలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ కూడా రంగంలోకి దిగిందని, ఆయా రాష్ట్ర ఉత్పత్తులను తెలంగాణలో ప్రమోట్ చేయడానికి ఆ రాష్ట్రం పెద్ద ఎత్తున తాయిలాలు ప్రకటిస్తున్నది. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఫార్మా, ఆహార ఉత్పత్తుల పరిశ్రమలను ఆకర్షించేందుకు తరచూ రాష్ట్రంలోని పరిశ్రమ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఓ వైపు రాష్ట్రంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, మరోపక్క ఇతర రాష్ట్రాలు పిలుస్తుండడంతో ఎంఎస్‌ఎంఈలు పక్క రాష్ట్రాలకు వెళ్లే అనివార్య పరిస్థితులు ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి..

- *2,500 ఎకరాల్లో 28 పారిశ్రామికవాడల ఏర్పాటుతోపాటు 12 పారిశ్రామిక వాడల అప్‌గ్రేడేషన్, మరో 6 కొత్త పార్కుల ప్రతిపాదన*
- *దేశంలో ఎక్కడా లేనివిధంగా సుమారు 500 ఎకరాల్లో గ్రీన్ ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు. ఇందులో దాదాపు రూ.1,500 కోట్ల పెట్టుబడులతో 450 పరిశ్రమలు ఏర్పాటుకాగా, వీటిద్వారా 35 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.*
- *2014 నుంచి సుమారు 20 వేల ఎంఎస్‌ఎంఈలు కొత్తగా నమోదు చేసుకున్నాయి. దీంతో మొత్తం సంఖ్య 26 లక్షలకు చేరుకున్నాయి.*
- *ప్రస్తుతం రాష్ట్రంలో ఈ చిన్న-చితక సంస్థలు మొత్తంగా రూ.31 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి.*
- *ఈ విభాగంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య దాదాపు 40 లక్షలు*
- *2014-2023 మధ్యకాలంలో ఎంఎస్‌ఎంఈల వార్షిక వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతానికి చేరుకున్నది.*

షియోమీ 15 సిరీస్ ఫోన్లు

ప్రారంభ ధర రూ.64,999

నూఢిల్లీ, మార్చి 15: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త సిరీస్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 15 సిరీస్‌లో భాగంగా విడుదల చేయనున్న ఈ ఫోన్లు అడ్వాన్స్‌డ్ కెమెరా స్మార్ట్‌ఫోన్లతో తీర్చిదిద్దింది. వీటిలో షియోమీ 15 ధర రూ.64,999గా నిర్ణయించిన సంస్థ.. షియోమీ 15 అల్ట్రా మాడల్ ధర రూ.1,09,999కి విక్రయిస్తున్నది. ఈ రెండు ఫోన్లు అమెజాన్‌లో వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది. 6.36 అంగుళాల క్రైస్టల్‌రేస్ డైనమిక్ 1-120 అమోలెడ్ టచ్‌స్క్రీన్‌తో తయారు చేసిన ఈ ఫోన్‌లో 14 ఎంఎం నుంచి 120 ఎంఎం ఫోకల్ లెంత్‌తో మూడు కెమెరాలు, 50 మెగాపిక్సెల్ లైకాకెమెరా, 5240 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 19 నుంచి ముందస్తు బుకింగ్‌లు ఆరంభిస్తున్నట్లు ప్రకటించింది.

కొనసాగుతున్న ఎఫ్‌ఐఐల అమ్మకాలు

ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 1.64 లక్షల కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ, మార్చి 15: దేశీయ ఈక్విటీ మార్కెట్లపై విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులో ఆందోళనలో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీగా తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.64 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, వాణిజ్య యుద్ధాలు మరింత తీవ్రతరం కావడం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. మరోసారి అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నట్లు వచ్చిన వార్తలతో ఎఫ్‌ఐఐలు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించారు. దీనికి తోడు ఆటోమొబైల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం కూడా ఎఫ్‌ఐఐలు వెనక్కి తీసుకోవడానికి ప్రధాన కారణమని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. బ్యాంకింగ్ రంగ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని, దీంతోపాటు రియల్టీ, ఆటో, మెటల్ సూచీలు కూడా పతనం చెందడం వారి ఆందోళనను తీవ్రతరం చేసింది.

ఆదుకున్న డీఐఐలు

ఒకవైపు ఎఫ్‌ఐఐలు భారీ స్థాయిలో నిధులను తరలించుకుపోతుంటే మరోవైపు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈక్విటీల్లోకి రూ.1.77 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. కొత్తగా ఈక్విటీ మార్కెట్లోకి పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య పెరగడం కూడా ఇందుకు పరోక్షంగా కారణమయ్యాయి.

తగ్గిన పసిడి రిజర్వులు

గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు ఎట్టకేలకు పెరిగాయి. ఈ నెల7తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 15.26 బిలియన్ డాలర్లు ఎగబాకి 653.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత రెండేండ్లలో ఒకేవారంలో ఇంతలా పెరగడం ఇదే తొలిసారి. అంతక్రితం వారంలో రిజర్వులు 1.781 బిలియన్ డాలర్లు కరిగిపోయి 638.698 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 13.993 బిలియన్ డాలర్లు ఎగబాకి 557.282 బిలియన్ డాలర్లకు చేరుకోగడం ఇందుకు కారణం. కానీ, బంగారం నిల్వలు మాత్రం కరిగిపోయాయి. గతవారంలో 1.053 బిలియన్ డాలర్లు తగ్గి 74.325 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది.

ఈ-కామర్స్ దిగ్గజాలకు షాక్

న్యూఢిల్లీ, మార్చి 15: ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలకు బీఐఎస్ షాకిచ్చింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు చెందిన గిడ్డంగులపై దాడులు చేసి..వేలాది సంఖ్యలో ధృవీకరించబడని వినియోదారుల ఉత్పత్తులను సీజ్ చేసినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నెల 7న లక్నోలోని అమెజాన్ గిడ్డంగుల్లో తనిఖీ చేసి 215 టాయ్స్, 24 హ్యాండ్ బ్లెండర్ల ఉత్పత్తులను సీజ్ చేసింది. అలాగే ఢిల్లీలో అమెజాన్‌కు ఉన్న గిడ్డంగిలో 58 అల్యూమినియం రేకులు, 34 మెటాలిక్స్ వాటర్ బాటిళ్లు, 25 ఆటబొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పీవీసీ కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్లు సీల్ చేసింది. వీటికి సంబంధించి ఎలాంటి కాగితాలు లేవని బీఐఎస్ గుర్తించింది. అలాగే ఫ్లిప్‌కార్ట్ గిడ్డంగిలో 534 స్టెయిన్‌లెస్ స్టీల్ వాక్యూమ్, 134 ఆటబొమ్మలు, 41 స్పీకర్లు సీల్ చేసినట్లు బీఐఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఊటూర్‌లో గ్యాంగ్ కల్చర్ కలకలం

- ఇరువర్గాల ఘర్షణ.. ఒకరికి తీవ్రగాయాలు
- హోలీ పండుగ వేళ ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

మానకొండూర్ రూరల్, మార్చి 15: గ్యాంగ్ కల్చర్ కాస్తా పల్లెల్లోకి పాకినట్లుంది. హోలీ పండుగ సందర్భంగా మద్యం మత్తులో పాత కక్షలతో రెండు గ్యాంగుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడి తీవ్రగాయాలపాలైన ఘటన ఊటూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మానకొండూర్ మండలం ఊటూర్‌లో హోలీ వేడుకల అనంతరం శుక్రవారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు ఓ చోట చేరి మద్యం సేవించారు. మద్యం మత్తులో అందులోని రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనగా, కొందరు శాంతింపజేశారు. ఈ క్రమంలో ఎవరి ఇంటికి వారు వెళ్లారు. ఓ వర్గం వారు మరో వర్గానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అనే యువకుడు ఒంటరిగా ఉండడాన్ని చూసి, సన్నిహితంగా ఉన్నట్లు నటించి అతడిని ఓ ఆటోలో అపహరించారు. గ్రామ శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లి కట్టెలతో స్పృహ తప్పి పడిపోయేలా కొట్టారు. అప్పటికే చనిపోయి ఉంటాడని భావించి.. సదరు యువకుడు ఉండే కాలనీకి మూడు ఆటోల్లో వెళ్లి ఆ ప్రాంతంలో అలజడి సృష్టించారు. అనుమానం వచ్చిన ఆ కాలనీ వాసులు శ్రీనివాస్ కనబడకపోవడంతో అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే గ్రామ శివారులో ఆచూకీ కోసం వెతకగా, ఓ పొలం వద్ద చెప్పులు కనిపించాయి. మరో పొలంలో స్పృహ తప్పి పడిపోయి ఉన్న శ్రీనివాస్‌ను గుర్తించారు. వెంటనే బంధువులు, గ్రామస్తులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇంకా ఈ దాడికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మొండి బకాయి దారులపై బలియా చర్యలు

- రెడ్ నోటీసులు జారీ • నల్లా కనెక్షన్లు కట్

పన్నులు కట్టని బకాయిదారుల నల్లా కనెక్షన్ తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది

కార్పొరేషన్, మార్చి 15: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా పన్ను చెల్లించని ఇంటి యజమానులకు మొదటగా రెడ్ నోటీసులు జారీ చేసి సమయం ఇస్తున్నారు. అప్పటికి కూడా ఇంటి యజమానులు పన్నులు చెల్లించకపోతే నల్లా కనెక్షన్లు తొలగించడంతోపాటు చట్టపరంగా ఇతర చర్యలు కూడా చేపడుతున్నారు. ఇంటి యజమానులు అందరూ సకాలంలో పన్నులు చెల్లించి తమకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. పన్నులు చెల్లించని మొండి బకాయి దారులకు చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని పలు మొండి బకాయి దారుల నల్లా కనెక్షన్ తొలగించడంతో పాటు పలువురు బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు.

హత్యనా.. ఆత్మహత్యనా..?

- రైల్వే ట్రాక్‌పై యువతీ యువకుడి మృతదేహాలు

హుజూరాబాద్, మార్చి 15: జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ సమీప గ్రామమైన పాపయ్యపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని యువతీ, యువకుడు రైల్వే ట్రాక్ పైన శనివారం రాత్రి విగతజీవులై కనిపించారు. వివరాల్లోకి వెళ్తే.. పాపయ్యపల్లి గ్రామ శివారులో రైల్వే ట్రాక్ పక్కన యువతీ, యువకుడి మృతదేహాలను శనివారం రాత్రి స్థానికులు గుర్తించారు. యువతీ యువకుల తలలు మాత్రమే పగిలిపోయి ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం చేసున్నారు. రైలు నడుస్తున్న క్రమంలో డోర్ వద్ద కూర్చుని ప్రమాదవశాత్తు పడి మృతి చెందారా.. లేక ఎవరైనా హత్య చేసి ట్రాక్ వద్ద పడేశారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ రైలు నుంచి జారిపడినట్లయితే ఇద్దరికీ తీవ్రంగా గాయాలు కావడంతో పాటు శరీరంలోని పలు భాగాలు చిందరవందరగా మారే ఆస్కారం ఉంటుంది. కానీ అలాంటిది ఏమీ లేకుండా కేవలం తలలు మాత్రమే పగిలి ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మృతి చెందిన యువతీ, యువకుడు ప్రేమ జంటేనా అనే విషయం తెలియాల్సి ఉంది. ఘటన జరిగి రెండు గంటలు గడిచినా కూడా అటు రైల్వే పోలీసులు, ఇటు సివిల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోకపోవడం గమనార్హం. ఏదేమైనా తెల్లారితే గానీ యువతీ యువకుడి మృతి వివరాలు పూర్తిస్థాయిలో తెలిసే అవకాశం ఉంది.

బయోమైనింగ్ అటకెక్కినట్లేనా?

డంప్ యార్డులో బయో మైనింగ్ యంత్రం

- డంప్‌యార్డులో ముందుకు సాగని ప్రక్రియ
- ఇప్పటికే కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిన అధికారులు
- అపరిష్కృత సమస్యతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు

కార్పొరేషన్, మార్చి 15: కరీంనగరానికి ప్రధాన సమస్యగా మారిన డంప్ యార్డును పూర్తిగా తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని అక్కడ ఉన్న చెత్తను పూర్తిగా బయోమైనింగ్ ద్వారా క్లీన్ చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ మేరకు సుమారు రూ.16 కోట్ల వ్యయంతో బయోమైనింగ్ చేపట్టేందుకు టెండర్లు నిర్వహించి హైదరాబాద్‌కు చెందిన సంస్థకు అప్పగించారు. ఏళ్ల తరబడిగా పేరుకుపోయిన డంప్ యార్డులో చెత్తను పూర్తిగా తొలగించాలని ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టారు. కానీ ఈ ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డంప్ యార్డులో బయోమైనింగ్ పనులు ఏడాది కాలంగా పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి వరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టర్ పేర్కొంటుండగా నగరపాలక సంస్థ నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచినట్లుగా తెలుస్తున్నది. ఈ క్రమంలో ఇక బయోమైనింగ్ పనులు అటకెక్కినట్లేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అటు అధికారులు కూడా పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తున్నది. ఇక డంప్ యార్డులో తరచూ మంటలు ఎగిసిపడుతుండడం.. నెలల తరబడిగా పొగ వెలువడుతుండడంతో స్థానిక ప్రజలతో పాటు, చుట్టుపక్కల ఉన్న వివిధ కాలనీ వాసులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని నెలలు మాత్రమే సాగిన మైనింగ్

పనులు నగరంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న డంప్ యార్డు సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలోనే ప్రయత్నం చేశారు. బయోమైనింగ్ కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. రెండేళ్లలో ఈ డంప్ యార్డులో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించి ఆధునికంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నాలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీతో పనులు ప్రారంభించారు. ఆరంభంలో రెండు యంత్రాలను ఏర్పాటు చేసి వేగంగా బయోమైనింగ్ చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు కూడ ప్రకటించారు. రెండేళ్ల కిత్రం ఒక యంత్రాన్ని ఏర్పాటు చేసి బయోమైనింగ్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. త్వరలోనే రెండోది కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు సంస్థ ప్రతినిధులు రెండో యంత్రం ఏర్పాటు చేయకపోగా, ఉన్న యంత్రం ద్వారా కూడా బయోమైనింగ్ బంద్ చేసి చాలా రోజులు అవుతున్నది. ముఖ్యంగా పనులన్నీ మధ్యలోనే వదిలేయడంతో తరచూ డంప్ యార్డులో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా బిల్లుల చెల్లింపుల్లో వచ్చిన సమస్యల వల్లే ఈ బయోమైనింగ్ నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. అయితే పనులు చేపట్టిన మేరకు బిల్లులు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నా కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. దీంతో ఇటీవల నగర కమిషనర్ సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా జారీ చేసినట్లుగా సమాచారం. మరోసారి బయోమైనింగ్ ప్రారంభమై డంప్ యార్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తరచూ అగ్ని ప్రమాదాలతో సమస్యలు

డంప్ యార్డులో తరచూ వస్తున్న అగ్ని ప్రమాదాల వల్ల చుట్టు పక్కల ఉన్న అనేక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రాజీవ్ రహదారిపై వెళ్లే వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో కొన్ని రోజుల పాటు ఈ డంప్ యార్డు నుంచి పొగలు వస్తుండడంతో ఉదయం, సాయంత్రం, రాత్రిళ్లు స్థానిక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల రెండు రోజుల క్రితం భారీగా మంటలు ఎగిసిపడడంతో స్థానికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి డంప్ యార్డు సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మొండి బకాయిదారులపై దృష్టి సారించాలి

కార్పొరేషన్, మార్చి 15: మొండి బకాయిదారులతో పాటు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల ప్రాపర్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రూ.50 వేల కంటే ఎక్కువ ఆస్తి పన్ను బకాయి ఉన్న మొండి బకాయి దారులపై చట్ట పరంగా చర్యలు తీస్కోవాలని కోరారు. ప్రధానంగా నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని రైస్ మిల్లుల ప్రాపర్టీ ట్యాక్స్ కట్టేలా చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ఆస్తి పన్నులు చెల్లించని సంస్థలకు ఆర్ ఆర్ యాక్ట్ ను ఇంప్లిమెంట్ చేసి ట్యాక్స్ కట్టించేలా చూడాలని ఆదేశించారు. ఆస్తి పన్నులు చెల్లించని బకాయి దారులకు నగరపాలక సంస్థ రెడ్ నోటీసులు జారీ చేస్తూ వారి నీటి సరఫరా కలెక్షన్ ఇతర అత్యవస సర్వీసులను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గతంలో రెడ్ నోటీసులు ఇచ్చిన బకాయి దారుల నల్లా కనెక్షన్లను డివిజన్ వారీగా తొలగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఇన్‌చార్జి ఆర్వో కలీముల్లా ఖాన్, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాలు వితరణ

కొత్తపల్లి, మార్చి 15 : మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కరీంనగర్ టవర్‌సర్కిల్ సమీపంలోని నేషనల్ రేడియో హౌస్ అధినేత తొడుపునూరి నవీన్ కుమార్, తొడుపునూరి సత్యనారాయణ సుమారు రూ.70 వేల విలువైన బోధన అభ్యసన సామగ్రి, ల్యాబ్ పరికరాలు, 10 కుర్చీలను వితరణ చేశారు. చింతకుంట పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాతీయ పురస్కార గ్రహీత నలుమాచు చంద్రశేఖర్ చొరవతో పాఠశాలకు ఈ వస్తువులను అందించారు. దాతలకు ప్రధానోపాధ్యాయిని శోభారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వినోద్ కుమార్, రవీందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రజిత, శ్రీహర్ష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభం

ముకరంపుర, మార్చి 15: వేసవి విద్యుత్ కార్యాచరణలో భాగంగా టౌన్-6 సెక్షన్‌లో 100 కేవీఏ స్థానంలో రెండు 160కేవీఏ ట్రాన్స్ ఫార్మర్లు, టౌన్-9 సెక్షన్‌లో 100కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను శనివారం టౌన్ డీఈ జే రాజం శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టౌన్-2 ఏడీఈ లావణ్య, ఏఈలు మల్లయ్య, ఓంకార్, త్రిమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రఫుల్ దేశాయ్ తదితరులు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్
- ఆకట్టుకున్న అంతర్జాతీయ టెడ్-ఎడ్ టాక్స్

కమాన్‌చౌరస్తా, మార్చి 15 : విద్యార్థులు వచ్చిన అవకాశాలను చేజార్చుకోకుండా, వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. ప్రతిభకు పదును పెట్టాలని లక్ష్యసాధనకు నిరంతరం కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. కరీంనగర్ స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం పారమిత విద్యా సంస్థల ఆధ్వర్యంలో టెడ్-ఎడ్ అంతర్జాతీయ టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు, పారమిత నుంచి ఇద్దరు విద్యార్థులు టెడ్ ఎడ్ టాక్స్ లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడి ఆకట్టుకున్నారు. గత సంవత్సరం అక్టోబర్ 23న పారమిత పాఠశాలలు, కరీంనగర్ జిల్లా విద్యాశాఖల మధ్య ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతర్జాతీయ టెడ్-ఎడ్ టాక్స్ శిక్షణనివ్వడానికి కలెక్టర్ పమేలా సత్పతి, పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ ప్రసాద రావు మధ్య ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారం పారమిత విద్యా సంస్థలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండున్నర నెలలు పారమిత వసతిగృహంలో శిక్షణను ఇచ్చి ఈ టెడ్-ఎడ్ అంతర్జాతీయ వేదికపై ప్రసంగించేలా తర్ఫీదు ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఆరుగురు విద్యార్థులు టెడ్ ఎడ్ టాక్స్ కార్యక్రమంలో అంశాలపై అద్భుతంగా ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఇక్కడ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్ రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఈ ప్రసాదరావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఎంఈవో ఏనుగు ప్రభాకర్ రావు, పలువురు ఎంఈవోలు హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులు, పారమిత పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్పులు తీర్చుకునేందుకు బ్యాంకు నుంచి రుణాలు

తెలంగాణచౌక్, మార్చి 14: రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద పొందిన అప్పులను తీర్చుకోవడానికి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే అవకాశం ఉందని రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో శనివారం రైతు మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలు, వాటి అమలుకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రుణాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయ సేవా సంస్థల చైర్ పర్సన్లకు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గత నెల 27న ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పు అవసరమున్న రైతులు వెంటనే సంబంధిత బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంతో ప్రయోజనకరమైన ఈ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకొని, ప్రైవేటు అప్పుల నుంచి విముక్తి పొందాలన్నారు. సమావేశంలో రైతు మిత్ర రాష్ట్ర కార్యదర్శి చందుపట్ల నర్సింహా రెడ్డి, రాష్ట్ర నాయకుడు జున్నూతుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరీంనగర్ రూరల్, మార్చి 15: తీగలగుట్టపల్లిలో బైక్‌కు అడ్డువచ్చిన కుక్కను తప్పించే క్రమంలో వాహనం చెట్టుకు ఢీకొనగా, తీవ్రగాయాలపాలైన రాజేశ్‌గుప్తా (28) అనే యువకుడు దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వాడు కాగా, కిసాన్ నగర్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం వల్లంపహాడ్ గ్రామ శివారులో పని కోసం వెళ్తుండగా, మార్గ మధ్యంలో మాణికేశ్వరీ రోడ్ నం 7 వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. రాజేశ్‌గుప్తా సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.